అక్కచెల్లెళ్లు

[కథానిక]

★

= 'స్వైరవిహారి' =

(గతసంచిక తరువాయి)

రాత్రి ఒంటిగంటకు రైలుదిగి ఇంటికి వెళ్లిచూసే సరికి తలుపు తాళంవేసిఉంది. గత్యంతరంలేక, ప్రక్కయింటివారిని కనుక్కుందామని తలుపు పిలుస్తున్న సమయంలో, నిద్రతో సోలిపోతున్న లక్ష్మి శరీరభారాన్ని సగం తానే వహిస్తూ ధీరంగా వచ్చేడు రామనారాయణ. వెన్నెల గ్రుడ్డిగా ఉండడంవల్ల, దగ్గరకు వచ్చేదాకా ఆవచ్చేది రామనారాయణే నని రాజేశ్వరికూడా గుర్తించలేకపోయింది. దగ్గరకు వచ్చిన తర్వాతకూడా తీక్ష్ణంగా చూసేకగాని ఫలానా అని గ్రహించలేకపోయేడు రామనారాయణ. మధుసూదనరావు (రాజేశ్వరితండ్రి) గారికి దేదో నాటకంలా గుంది. ఇక లక్ష్మికి ఎదుట నున్న వ్యక్తులకంటె స్వప్నలోకంలోని వ్యక్తులే ఎక్కువ స్ఫుటంగా కనిపిస్తున్నారు.

మధుసూదనరావుగారు రామనారాయణను అంటిపెట్టుకొనిఉన్న లక్ష్మివైపు ఒక్కనిముషం నిదానంగా చూసి, కూతురువంక తిరిగి, "అమ్మాయీ! నాకు మళ్ళీరైలుంది. నువ్వుంటావా, నాతోవస్తావా?" అన్నారు.

రాజేశ్వరి అతిప్రయత్నంమీద, గద్గదస్వనంతో "మీరు వెళ్లండి నాన్నా!" అని ఇంకా ఏమేమో అనదల్చుకుంది కాని బలవంతంగా ఆమెగొంతు ఎవరో తొక్కినట్టయింది.

వెనక తిరిగి వెళ్లిపోతున్న తండ్రిపైమీదివాణీ అతడి మొగంమీదికి వెళ్లడంతో అంతవరకూ ఎంతో ప్రయత్నంమీద నిలిచిన ఆమెవేడికన్నీళ్లు జలజల రాలేయి.

*　　*　　*

రామనారాయణకు రాజేశ్వరీపునరాగమనం ఒకవిధమైన గాభరానేకాదు, భయాన్నికూడా కలిగించింది. ఒక్కమారుగా అతనికి ఏదో అంతర్వాణి ఉపదేశించినట్టుగా తానిటీవల చేసిన ప్రతీపనీ దోషయుక్తమే ననిపించింది. ఒకవేళ మామగారు అంత ప్రశాంతంగా వెళ్లిపోకుండా తనను నిలవదీసి ప్రశ్నిస్తే తానేమని జవాబుచెప్పేవాడు? తనకూ లక్ష్మికీ ఉన్న సంబంధంగురించి (ప్రత్యక్షంగా తెలుస్తూఉండడంవల్ల) అసత్యం ఆడడానికి ఎంతమాత్రమూ సావకాశం లేదే! ఇంతకూ రాజేశ్వరిలోని దోషమేమిటే అని అతను గట్టిగా అడిగితే తాను చెప్పే కారణమేమిటి? ఎంత ఆలోచించినా రామనారాయణకు నాటిరాత్రి జరిగిన విశేషాలకు లవలేశమూ పొందిక కనిపించలేదు.

మర్నాడు ఉదయం అతనికి తెలివి వచ్చేసరికి తాను తనగదిలో పడకకుర్చీలో ఉన్నాడు. ఎదుటి మంచంమీద లక్ష్మి నిద్రపోతూంది. గదిలోని ఇంకొక మంచం గోడకు చేరవేసి ఉంది. మరి రాజేశ్వరి ఏదీ?

లేక నిన్న రాత్రి తాను కలగన్నాడా? కొంచెం నిదానించి చూచేసరికి, సగం తీసిఉన్న గదితలుపు సందులోనుండి సావడిలో నేలను పండుకొని ఉన్న రాజేశ్వరి కనబడింది. అతని మనశ్శకట మొక్కక్షణం నిశ్చలమయింది. చీటికీ మాటికీ తనతో పోట్లాడే రాజేశ్వరిలో ఇంత స్త్రీత్వ ముందా? ఆమె యీ మాత్రము స్థలం దొరకకా తనదగ్గరకు వచ్చింది? ఇంతకూ ఆమె వెళ్లేటప్పుడు తన అనుమతిని తీసుకునే వెళ్లిందే! ఆమెను తృప్తిపరచలేకపోవడంలో తన తప్పేమీ లేదు కాని, యీ రకంగా వేధించటంలో తనపట్ల న్యాయమేదీ?

అతనికి రోజూ నిద్రలేవగానే తలదువ్వుకోవడం ఈ మధ్య లక్ష్మి వచ్చినదగ్గరనుండి అభ్యాసమయింది. ఇవాళ ఏమిటో ఉత్సాహంగా లేదు. అయినా అద్దం, దువ్వెనా అందించవలసిన లక్ష్మి యింకా నిద్రలేవనే లేదు.

ఏదో దొంగతనం చెయ్యబోయేవాడులా మెల్లిగా అడుగులువేసి వెళ్లి, ఒక్కక్షణం సంశయించి, మృదువుగా స్పృశిస్తూ ఏకాంతం చెప్పినట్టుగా "లక్ష్మీ! లక్ష్మీ! లే లే, తెల్లవారింది. కాఫీ..." అంటూ ఉండగానే సోగలైన కళ్లు సగం విప్పి, "ఇవాళ ఏమో నీరసంగా ఉంది; కాస్త కుంపటి అంటించి, నీళ్లుపడేద్దూ, నేను లేచి కాఫీ కలిపేస్తాను" అని మళ్లీ కళ్లుమూసుకుంది.

రామనారాయణకు యీ పద్ధతేమీ క్రొత్తది కాదు. కాని ప్రస్తుతస్థితిలోమాత్రం అతిచనవువల్ల లక్ష్మి తనకేమో తీరని అవమానం కలిగించినట్టు తోచింది. ఏమీ మాటాడకుండా ఎటో తనకే తెలియకుండా వీథిలోనికి బయలుదేరేడు.

పార్కుగుండా బస్సుస్టేండును సమీపించేవరకు అతనికి తన శరీరంమీద స్మృతే లేదు అనాలి. అక్కడ ఎన్నో మగగొంతులను ఛేదించుకుంటూ ఒక స్త్రీకంఠస్వనం వినిపిస్తోంది. రామనారాయణకు ఇటువంటివంటే స్వాభావికంగా చాలా అసహ్యం. కాని ఆవాడాగోలకు కారణం ఏమిటో తెలుసుకోవాలని బుద్ధిపుట్టింది. పదిమందిని పాతికప్రశ్న లడిగి అతడు గ్రహించిన విషయం సారాంశం ఏమిటంటే, ఒక భర్త తన మొదటిభార్యనూ, పిల్లలనూ వదలి ఇంకొక స్త్రీని లేవదీసుకొనిపోతున్న సందర్భంలో (హక్కుగల) భార్య వారిని నిరోధించడానికి చేసే ప్రయత్నమే ఆగోల అని. ఆ రెండవస్త్రీముఖంలో గడియకో క్షణానికో ఉరితీయబడే వ్యక్తిముఖంలో కనిపించే దిగులు ద్యోతకమౌతున్నది. అందరూ తలాఒకరీతిని ముగ్గురకూ కర్తవ్యం ఉపదేశిస్తున్నారు—ఒకరి మాట ఒకరికి వినిపించకుండా. ఈమాత్రం తెలుసుకొనేసరికి, శారీరకంగా పడిన శ్రమవల్లనేకాక, మానసికంగా మళ్లీ విజృంభించిన భావనాకల్లోలంవలన అతనికి ఎంతో అలిసిపోయిన ట్లనిపించింది. నెమ్మదిగా వెళ్లి దగ్గరగా వున్న కాఫీహోటలులో ప్రవేశించి, కాస్త టిఫిన్ తిని కాఫీతాగేపర్యంతమూ అతను తేరుకోలేదు.

కిళ్లీదుకాణందగ్గర సిగరెట్టు అంటిస్తూఉండగా రామంగారు కనిపించి "మీయింటికనే బయలుదేరేను- శాస్త్రిగారు నాఆర్టికిలు చూస్తా నంటున్నారు- నాభారతి—"

రామనారాయణకు ఇంటికి వెళ్లడమంటే ఏదో అవ్యక్తమయిన భయం వేసింది. "మేనేజరు త్వరగా రమ్మని కబురుచేసేడు. ఇంట్లో కాఫీ ఆలస్యమవుతుందని ఇక్కడ తీసుకొనివెళ్తున్నాను. నేను ఆఫీసుకు వెళ్లేటప్పుడు మీయింట్లో పడేస్తానులెండి. మరి సెలవ్" అంటూ అతడు నడక సాగించేడు. అతడానాడు సాయంవేళనుకూడా ఇంటికి వెళ్ల లేదు. సినీమా (మొదటిఆట)కు వెళ్లేడు.

సినీమాలో కథానాయకుని తండ్రికి వియ్యంకునితో పడక, పుత్రునికి పునర్వివాహం చేస్తాడు. అతని అనంతరం కొడుకు యథేచ్ఛాచారి అయి, తన

మిత్రుని పునర్వివాహం చేసుకొన్న తన మొదటిభార్యను ఫలానా అని తెలియకుండా లేవదీసుకొనివస్తాడు. ఆమె ఆతని తమ్మునితో కలిసి కుట్రచేసి, అతనికి విషమిస్తుంది. అతని రెండవ భార్య నూతిలో పడి పోతుంది. వదినకూ మరిదికీకుదరక, ఒకరి నొకరు రివాల్వర్లతో కాల్చుకోవడంతో కథ సాంతమయింది. సినీమాపేరు "అన్యాయ్!"

అసలే కలవరపడివున్న అతని మనస్సును సినీమా మరీ కలవరపరచింది.

హాలులోనుండి బైటికి వచ్చేసరికి ఉక్క, కలవరపాటు, సంఘర్షణలేకాక చల్లదనము, హాయి, శాంతి అన్న లక్షణాలుకూడా పంచభూతాత్మకమయిన ఈ మన ప్రపంచకంలో మిగిలిఉన్నాయన్నట్టుగా ఉంది వాతావరణం. ఎంతటి హృదయసంక్షోభాన్నయినా మరపించగలదిగా ఉంది ఆనాటి వెన్నెల అనడానికి అతని మనస్సు అతిలోకమయిన ఆనందంతో తొణికిసలాడడమే తార్కాణం. కాని వెన్నెల ఎంత తీయనిదో అంత పలచనిదికూడా. దానివలన కలిగే నిషా అట్టేసేపు నిలవదు. అలా నిలవడానికి వాతావరణంలోని నందప్రదలక్షణాలతోపాటు మానవలోకానికి సంబంధించిన అనుకూల్యంకూడా ఉండాలి.

ఇంటిని సమీపించే దారిలో చివరిమలుపు తిరిగే వేళకు తటాల్న స్మృతిలోనికి వచ్చింది అతనికి తన యింటి పరిస్థితి. దానితో వెన్నెలమైకం వదిలి పోయింది. ఒక్కొక్క అడుగు వేస్తున్నకొద్దీ అతని అనుమానం ఎక్కువ కాసాగింది తలుపేమని పిలవడమా అని.

దగ్గరగా వేసిఉండడంవల్ల తలుపు పిలువవలసిన అవసరమే లేకపోయింది. ఏదో అవసరమయిన పని ఉన్నట్టు తన గదిలో సరభసంగా ప్రవేశించేడుగాని తర్వాత ఏమి చేయడానికీ తోచలేదు.

టేబిలుమీద చిన్నది చేయబడి ఉన్న దీపాన్ని కొంచెం పెద్దది చేసేడు. అద్దంలో తన మొగం తనకే అసహ్యంగా ఉంది. అంత వికృతంగా ఉండడం కేవలం ఒక్కనాడు తలదువ్వుకోకపోవడంవల్లా, భోజనం చేయకపోవడంవల్లా మాత్రమే సంభవించదు.

అత డాదీపపు వెలుగులో ఏదో నిశ్చయంగా పోయిందని తెలిసిన వస్తువును ఆత్మశాంతికోసం వెతుకుతున్నట్టుగా పరిశీలించేడు. అన్నీ నిర్జీవపదార్థాలే. ఇంతసేపుగా అతడు లక్ష్మిని ఎప్పుడూ చూడకుండా ఉండలేదు. ఇన్నాళ్లూ మధ్యాహ్నం కాఫీకికూడా ఇంటికి (ఆఫీసుకు సుమారు మైలుదూరం ఉన్నా) వచ్చేవాడు. లక్ష్మి ఏదీ? తాను వెళ్లిపోయిన తర్వాతగాని ఇద్దరూ పోట్లాడుకున్నారా! లక్ష్మి వివాదపడే మనిషి కాదుగాని, రాజేశ్వరిమాత్రం—ఏమో ఇటీవల ఆమెకూడా మారిందేమో?

అతడు ఈ ఆలోచన పూర్తికాకమునుపే అలవాటు ప్రకారం స్నానానికని నూతిదగ్గరకు వెళ్లేడు. వెనుక రాజేశ్వరిహయాములో అతనికి స్వయంగా నీళ్లు తోడుకొని పోసుకోవడం మామూలే. కాని యీమధ్య లక్ష్మి అప్పటికప్పుడు నీళ్లుతోడి వేడినీళ్లతో కలిపి అందించగా స్నానం చెయ్యడం అభ్యాసంచేసింది. ఇవాళ మళ్లీ నీళ్లు తోడుకోవాలేమో? ఈ అనుమానానికి వెనుక లక్ష్మిగాని ఇంట్లోఉంటే ఇప్పుడయినా కనిపించకపోతుందా అన్న ఆశ అవ్యక్తంగా లేకపోలేదు. ఒక్కనిముషం ఆకాశంవేపు చూసి యిక మరి లాభంలేదని బాల్చి నూతిలో వెయ్యబోతూఉండగా, వెనుకనుండి "అక్కడ బిందెలలో నీళ్లు మీకోసమే. ఈపాటికి బాగా చల్లారిపోయేయి కాబోలు"అని రాజేశ్వరి మెల్లగా అని లోనికి వెళ్లి పోయింది.

తిరిగివచ్చినతర్వాత ఆమె తనతో ఆడిన మొట్టమొదటిమాట అదే. ఆమెకంఠస్వనం ఎంత కొత్తగా ఉంది! సారెగదిలోసైతమూ ఆమె అంత తడబడలేదు తనతో మాట్లాడడానికి.

స్నానం చేసి లుంగీ కట్టుకొని, ఏమి చేయడానికీ తోచక పడకకుర్చీలో కూలబడ్డాడు. ఏదయినా

పుస్తకం చూద్దామని తీసేసరికి వచ్చింది పాత ఫిల్మిండియాపత్రిక. ఆపుస్తకాన్ని చూడగానే అతని తలపులోనికి వచ్చింది ఆనాడు అందులో బొమ్మలు చూస్తూఉండగా ధైర్యం చేసి మొదటిమారు లక్ష్మిని ముద్దుపెట్టుకొన్న పరిస్థితి సర్వమూ. ఆనాడు అందులో నసీముబొమ్మకు ఎదుటి పేజీమీద తనపేరూ, లక్ష్మిపేరూ రాసి, బ్రాకట్ పెట్టి తారీఖు వేసేడు. గూఢార్థవిచిత్రకవిత్వాన్ని చూసుకొని కృతికర్త పొందే ఆనందాన్ని పొందేవా డత డిదివరకు ఆ రెండుపంక్తులనూ చూసి. నేడుమాత్రం ఆ రెండుపంక్తులలోనే తన అవినీతి, అన్యాయమూ అంతా ఘనీభవించినట్టు రూపించింది. అనుకోకుండానే పుస్తకాన్ని మూసి ఏదో ఎడతెగని ఆలోచనలో పడ్డాడు.

గదిఅవతలినుండి బ్రతిమాలుతున్నట్టుగా రాజేశ్వరిగొంతు "భోజనానికి లేవరూ ?"అని వినపడింది. అతడు త్రుళ్లిపడి లేచి, వెళ్లి పీటమీద కూర్చున్నాడు. అతడు భోజనం చేస్తున్నాడేగాని, మనస్సు మనస్సులో లేదు. ఏనిముషంలో ఏమి ఉప్పెన వస్తుందో అని భయం. అందులోనూ, రాజేశ్వరి తనలోని క్షోభనూ, క్రోధాన్నీ వాగ్రూపంగా మొదటనే వెలార్చిఉండేమాటైతే అతనికీఆందోళన లేకపోవును. కాని, ఆమెకు అసాధారణములయిన యీవినయమూ, వాగ్రహితవ్యవహారమూ అతనికేదో ఉఱుమని పిడుగింకా ముందున్నదనే భయాన్ని కలిగిస్తున్నవి.

"మరి అన్నం వద్దు. మజ్జిగ"అన్న మాట వినా అతడు భోజనసమయంలో నోరు మెదపలేదు. రాజేశ్వరి కూడా తాను మాట్లాడడానికిగాని, అతనిని మాట్లాడించడానికిగాని ఏమీ ప్రయత్నించలేదు. అతనికి మజ్జిగ పోసి గబగబా గదిలోనికి వెళ్లింది.

రామనారాయణకు చెయ్యి కడుక్కున్నాక ఒక చిన్న ధర్మసందేహం కలిగింది. ఆమె ఇప్పుడు గదిలో ఉందికదా ? తానూ లోనికి వెళితే ? ఇంతకాలంగా మెరుస్తూ ఆగమనంచేస్తూ ఉన్న గాలివాన ఒక్కమారుగా వస్తుందా ?

ఒక్కనిముషం తటపటాయించి, "ఎప్పటికేనా తప్పేది కాదుకదా! అదేదో త్వరగా అయిపోతేనే మే"లన్న మొండిధైర్యంతో, అతడు గదిలో ప్రవేశించాడు. కాని ఇప్పుడుకూడా అతనికి ఒక విధమయిన ఆనందమయాశాభంగమే! అతను తొందరగా వెళ్లి అన్నిటికీ నేను సిద్ధంగా ఉన్నానన్న సరణిని మంచంమీద కూర్చున్నాడు. ఆమె అధోముఖంగా, వణకుతూ ఉన్న చేతితో, తమలపాకుచిలకలూ వక్కపొడీ ఉన్న చిన్న వెండిపళ్లాన్ని అతని చేతికి అందించి వెంటనే అవతలకు వెళ్లింది. ఇంటికి వచ్చినదగ్గరనుండీ "లక్ష్మి ఏదీ ?" అని తననుతాను అనుక్షణం ప్రశ్నించుకొంటున్న ప్రశ్న ఇప్పుడుకూడా వెలికివచ్చింది కాదు. ఇక మరి ఈ సందేహం తీరడ మెలాగు ? అయినా రాజేశ్వరి ఎంతలా మారిపోయింది! అంతే కాదు. ఆమెలోని పరిణామం తనలో ఎంత పరివర్తనాన్ని తీసుకొనివచ్చింది!

ఆనా డతనికి మామూలుకంటెకూడా వేగమే నిద్రపట్టింది. కాని ఏదో ఇదమిత్థమని తేల్చుకోడానికి వీలులేని గాభరా కలిగించే కలతో తెలివివచ్చింది. లేచి, టేబిలుమీద మరచెంబులో ఉన్న మంచినీళ్లు తాగి, దీపం కొంచెం పెద్దదిచేసి, వాచీవైపు చూసేడు. టైము పన్నెండున్నర అయింది.

మళ్లీ దీపం తగ్గించి, వెళ్లి, మంచంమీద కూర్చొనేసరికి అతనికి నిద్రమత్తు పూర్తిగా వదిలింది. వెన్నెల కిటికీలోనుండి మంచంమీద సగంవరకూ పడుతున్నది. దూరాన ఎవరో ఫ్లూట్ వాయిస్తున్నారు. మొదట్లో అదేదో అతిలోకనినాదంవలె వినిపించింది. కాని కొంచెం నిదానంగా వినేసరికి ఎవరో సాధకం చేస్తున్నవారి వాద్యమని తెలిసింది. ఏమయితేనేం ? అంత వెన్నెలలో, అంతరాత్రప్పుడు, అంతదూరము నుండి వినిపించే సంగీతము పారవశ్యప్రదము కాకపోవడ మెలాగు ?

హఠాత్తుగా సంగీతము ఆగిపోయింది. దాంతో ప్రక్కగదిలోనుండి ఏవేవో గుసగుసలు వినిపించ

సాగాయి. మాటలు స్పష్టంగా తెలియడంలేదు గాని, ఆ మాటలాడుతున్నది లక్ష్మీరాజేశ్వరులని గ్రహించడానికి అతనికి ఎక్కువసేపు పట్టలేదు. అతనిని అనూహ్యమయిన ధైర్యమేదో ఆవేశించినట్టనిపించింది. వెంటనే "లక్ష్మీ!" అని పిలిచేడు. ఇప్పు డతని గొంతు నిండుగా, గంభీరంగా ఉంది. అప్పటికప్పుడే సగం సుషుప్త్యవస్థలోనూ, సగం జాగ్రదవస్థలోనూ ఉంది లక్ష్మి. ఆమె రాజేశ్వరి చెప్తున్న కొన్ని మాటలకు 'ఊఁ' అనటంకూడా లేదు. ఆమెను కదిపిలేపి, "ఆయన పిలుస్తున్నా"రని రాజేశ్వరి ఏకాంతంగా అన్నమాటలు మధ్యనున్న సన్నని సావడిని దాటి సకుతూహలములయిన అతని చెవులలో పడకపోలేదు.

ఆ నిద్రాలసతలోనే అతని మంచాన్ని ఆనుకొని నిలిచి, "ఏం బావా, పిలిచావా?" అంది లక్ష్మి ఎప్పటి చనవుతో.

అత డామెచేతిని రెండు చేతులతోనూ పట్టుకొని, "ఏం, ఇంకా నిద్రపోలేదూ?" అంటున్నప్పుడే అతనికి తెలుసును తాను యీ సమయంలో వేయవలసిన-అథమం వేయదలుచుకున్న ప్రశ్న అది కాదని.

"ఇంతసేపూ ఏవో కబుర్లు చెప్పుకుంటున్నాం నేనూ, అక్కయ్యాను. ఇప్పుడే కొంచెం నిద్రపడుతున్నది".

అతనికి యీసమాధానం తృప్తికరంగానే ఉంది. ఇంకా ఎన్నో సంగతు. లడగాలనిపించిందిగాని, అవతలిగదిలో రాజేశ్వరి మేలుకొనిఉందన్న స్మృతి అతనిని యథేచ్ఛగా మాటాడనీయలేదు. చివరికి ఎల్లానయితేనేం, ధైర్యంచేసి అన్నాడు: "ఇందాకా నువ్వు కనిపించలేదేమి? ఎక్కడికైనా వెళ్లేవేమో ననుకున్నాను."

"ఎక్కడికి వెళ్తాను నేను? అయినా నువ్వు రోజల్లా కనిపించనివాడివి, రాత్రి పదిగంటలకు వస్తావనిమాత్రం ఎవరయినా కలగనగలరా ఏమిటి?"

రామనారాయణకు ఏమనాలో తోచలేదు. కొంచెంసేపు ఊరుకొని, "ఆగదిలో దీపం ఉన్నట్టు లేదే! చీకట్లోనే పడుకున్నారా?" అన్నాడు.

పైప్రశ్నకు ఆమె సమాధానం చెప్పేలోపునే అతనికి మరొక ముఖ్యమయిన విషయం స్ఫురించింది. "లక్ష్మీ, మీయిద్దరికీ పక్కలున్నాయా? రెండుపరుపులూ ఇందుమీదే ఉన్నట్టున్నాయి—ఒకటి తీసుకోవలసింది" అన్నాడు.

"మేమిద్దరం అక్కయ్యపరుపు వేసుకొని నామంచంమీద పడుకున్నాము. చిన్నమంచం, ఇద్దరికి బాగా సరిపడదని నే నంటున్నా సరే, అక్కయ్య నాదగ్గరే పడుకుంటా నంది. ఇంకా అక్కయ్యను చిన్నతనమూ, సిగ్గూ వదలలేదు"అని ఆవులిస్తూ, "బాగా నిద్రవస్తోంది. నీకుకూడా రేపు ఆఫీసుంది. నువ్వూ నిద్రపో"అంటూ ఆమె చల్లగా వెళ్లిపోయింది.

ఆమె వెళ్లి నిద్రపోయిన ఎంతసేపటికో గాని రాజేశ్వరికి నిద్రపట్టలేదు. ఆమెమనస్సులో అనంతములయిన ఆలోచనలు. అన్నీ తనకూ, భర్తకూ, లక్ష్మికీ సంబంధించినవే. లక్ష్మిరామనారాయణలలో ఎవరిమీదా ప్రసన్నభావము లే దామెలో. కాని, వంతుల ప్రకారము ఇద్దరినీ మనస్సులో క్రాస్‌ఎగ్జామినుచేసి, ఎవరు ఎక్కువ నింద్యులో నిర్ధారించుకొనేలోపునే ఆమెకు నిద్రపట్టింది.

రామనారాయణ నిద్రలేచేసరికి లక్ష్మి ఎప్పటిలాగే ఇంటిపనుల్లో (కాఫీసరంజామూ, వేడినీళ్ల పొయ్యీ మొదలయినవాటిల్లో) నిమగ్న అయిఉంది. రాజేశ్వరి ఇంకా లేవలేదు. లక్ష్మి అతని స్నానానికి అలవాటు చొప్పున నీళ్లందించింది. అతడు బట్టలు వేసుకొనే లోపుగా కాఫీకలిపి ఇచ్చి "బావా, బజారుకు వెళ్లి సామాను తేవాలి. చీటీ, సంచీ ఇవిగో. కూరలు ముందుగా తెస్తే తక్కినవి ఇప్పుడో, సాయంత్రమో వీలునుబట్టి తెచ్చుకోవచ్చు"నంది.

అతడు మాట్లాడకుండా పైమీద వాణీ వేసుకొని సంచీపట్టుకొని బయలుదేరేడు.

లక్ష్మికి రాజేశ్వరీపునరాగమనం ఒక విధంగా సంతోషాన్నే కలిగించింది. రామనారాయణ ఎంత నిర్లక్ష్యంగా అస్పష్టంగా చెప్పినా, ఆమెకు రాజేశ్వరిస్వభావము అర్థంకాకపోలేదు. ఆమె పుట్టింట్లో ఒంటరిగా ఉండి పడుతున్న మనోవేదనను పట్టుదలే ప్రధానంగా ఎంచే రామనారాయణకంటె లక్ష్మి బాగా గ్రహించిం దనవచ్చు. తాను పరిస్థితుల తాత్కాలికోద్ధతివలన రాజేశ్వరివిషయంలో కొనసాగిస్తున్న అన్యాయలతికకు లవిత్రమువలె తోచింది లక్ష్మికి రాజేశ్వరీపునరాగమనం.

ఎక్కువ ఆలోచిస్తున్నకొద్దీ మరీ చిక్కులు కనపడతాయన్న జంకుచేతనో ఏమో, తనకు సంబంధించిన ఏ విషయమయినా, బాహ్యంగా సంతృప్తికరంగా ఉన్నంతసేపూ, లోతుకుపోయి ఆలోచించడం రామనారాయణకు అభ్యాసంలేదు. అతనికి లక్ష్మిరాజేశ్వరులు ప్రత్యక్షంగా ఎట్టి పోట్లాటలూ లేకుండానే కాదు, ఇతఃపూర్వమే పరిచయమున్న వారివలె ప్రవర్తించటం మొదట్లో కొంత ఆశ్చర్యాన్ని కలిగించినా, క్రమంగా సామాన్యమైన విషయం వలెనే కనిపించింది. కాగా అతని జీవితం ప్రస్తుపరిస్థితుల కనుగుణములయిన కొద్దిమార్పులతో మళ్లీ ఒక పద్ధతిలో పడ్డది. కాని, రాజేశ్వరి పుట్టింటిలో ఉన్నప్పుడు తాను లక్ష్మితో గడిపిన స్వల్పకాలమూ గతించిన ఆంధ్రవైభవాన్ని తలచుకొని నేటి ఆంధ్రుడు పడే ఆరాటాన్ని అతనిహృదయంలో కలిగిస్తుంది ఇప్పటికీ.

భర్తదగ్గరనుండి ఉత్తరమయినా లేకుండా, ఎవరెవరో తెలిసీతెలియనట్లుగా అన్న మాటలు తప్పని సరిగా వింటున్నప్పటి మనోవేదన రాజేశ్వరికి కొంత వరకు చల్లారింది. ప్రమాదము ప్రత్యక్షంగా వచ్చినప్పటికంటే, తప్పకుండా వస్తుందని తెలిసిన పరిస్థితి మరీ వేదనావహంకదా! ఇప్పుడు మరేమీ సందేహంలేదు. రావలసిన ప్రమాదమేదో రానేవచ్చేసింది. ఇక ప్రస్తుతపు సమస్య అల్లా, గృహిణిగా తనకు ఉండవలసిన స్థానాన్ని పునఃప్రతిష్ఠించుకోవడమే.

లక్ష్మి తనతో కలిసిమెలిసి ఉండడమన్నది రాజేశ్వరి కలలోనయినా ఊహించలేని విషయం. ఆమెదృష్టిలో అది ప్రకృతివిరుద్ధంకూడా. కాని మనము ముందుగా ఊహించకపోయిన మాత్రాన విశేషాలను జరగకుండా నిరోధించలేముకదా! తన చెల్లెలు సరళకంటే కూడా ఎక్కువ చనవుగా తనతో మాట్లాడుతోంది ఈ లక్ష్మి. ఈమె ఎవరు? ఈమెకూ, తనకూ ఉన్న సంబంధం ఎల్లాంటిది? తాను లేని సమయంలో తన భర్తను అధర్మపథంలోనికి ఆకర్షించిన ఒకానొక స్త్రీమాత్రమేకదా యీమె? సహజంగా తానంటే ఆమెలో సిగ్గూ, జంకూ మొదలయిన లక్షణాలు కలగాలి. అధమం ఆగ్రహమయినా రావాలి. ఏదయినా బాగుంది. దేనికయినా కొంత సందర్భశుద్ధి ఉంది; కాని, ఇల్లా అసందర్భంగా, క్షుద్రంగా తనతో ఖత్తుకలపడానికి యత్నించడమేమిటి? ఇతనిని ఎల్లానూ వశపరచుకొన్నానుకదా, ఇక దీనినికూడా స్నేహం నటించి లోబరచుకొంటే ఈ ఇంటిలో ఏకచ్ఛత్రాధిపత్యం వహించవచ్చునని కాబోలు దాని ఆశయం? అవును. అంతే. కాకపోతే ఆమెకు నాతో స్నేహం చెయ్యవలసిన అగత్యం ఏముంది? కాని, ఈమాత్రపుటూహలను గుర్తించే పాటి తెలివితేటలూ లేకపోవాలీ కర్మం! అయినా జేనికీ తొందరపడకూడదు. దీనికి పైయెత్తుమీదనే వెళ్లాలి. ముందు ఆనిక చూసుకొని, క్రమంగా మన స్థానాన్ని బలపరచుకోనిదే ప్రత్యక్షయుద్ధంలోకి దిగితే పరాజయం తప్పదుకదా?

అన్నిటికంటే విచిత్రమయినది ఆయనకు నన్ను కాదని దానిని తెచ్చుకోవలసిన ఆవశ్యకత కలగడమే. ఇంతకూ అదేమయినా అప్సరసా? దానిపాటి చక్కగానయినా లేనా నేను? పోనీ, దానివలన తనకేమయినా లాభిస్తుందా అంటే, ఏమాత్రం గనుక? ఆ విషయంలోనైనా, ఇప్పటికే అయిదారువేలు దాదాపు ముట్టజెప్పారు; ఇంకా మరొక పదివేలయినా ఏదోఒకరూపంగా ఇవ్వాలని చూస్తున్నారు నాన్నగారు. ఇక, వివాదాలు ఏవో వచ్చేయంటే, భార్యా

భర్తల మనుకొన్నతరువాత ఎవరికి రావు అభిప్రాయభేదాలు? అంతమాత్రంలో ఒకరికి ఒకరు కాకుండా అయిపోవడమేనా? కాదు, మహాఅనుకుంటే, తనకు నాతో ఏవో స్పర్థలు వచ్చేయే అనుకొందాం. వస్తే నన్ను సాధించాలి, లోబరచుకోవాలి; గాని మధ్యను దానితో సంబంధం పెట్టుకోవడం ఏమిటి? ఓహోహో, ఏమిపౌరుషం? తానంటే జాతీ, నీతీ, పరువూ, ప్రతిష్ఠా సర్వమూ మంటిలోకలిపి యథేచ్ఛగా ప్రవర్తించేరుగాని, అందరమూ అలాగే సిగ్గూ, లజ్జావిడిచి నడుచుకోలేముకదా! ఫలానావారి అమ్మాయి ఇల్లాగా అల్లాగా అని నలుగురినోటా పడడమా? ఛీ, తలుచుకుంటేనే ఒళ్లు గగుర్పొడుస్తోంది.

—ఇవీ ఆమెభావనావాహినిలో ఆడుతున్న స్వల్పసంఖ్యాకతరంగశీకరాలు.

*　　　*　　　*

ఇంకా రాజేశ్వరి ప్రత్యక్షయుద్ధపరికరాలను సమకూర్చుకొంటూనేఉంది. కాని, ఒకపక్షంవారు సన్నద్ధులయేవరకూ సన్నద్ధులయిన రెండవపక్షంవారు ఊరుకొనేఅంతటి ధర్మబద్ధములు కావుగదా నేటి యుద్ధాలు! రాజేశ్వరికి పరిస్థితులు పూర్తిగా అవగాహనకాకమునుపే, ఇవతలనుండి, లక్ష్మి ఆంతర శాంతిసమరపు భేరీ మోగించింది.

ప్రయత్నలోపంవల్లనో, ప్రతిస్పర్థిలోని బలాధిక్యంవల్లనో క్రమంగా రాజేశ్వరి ఎదటివారేర్పరచిన సంధిషరతులకు ఒడంబడకతీరని పరిస్థితి వచ్చింది. అయినా ఆమె సంధినియమాలనుగురించి ఇంకా తనలోతాను తర్కిస్తూ కాలహరణంచేస్తున్నది. ఈలోపున రాజ్యం ఏపక్షంవారికీ హక్కులేని ప్రజాస్వామ్యమైపోయే సూచనలుకూడా చాలా కనిపిస్తున్నాయి కాలమానస్థితులలో.

రాజేశ్వరికి తనయెడల ఆదృతికలిగించుకోవడం లక్ష్మికి అట్టే కష్టంగా తోచలేదు. కాని, తనను రామనారాయణనుండి వేరుపరచుకొని, రాజేశ్వరిని తన స్థానంలో ప్రతిష్ఠించడమన్నదే ఆమెకు రానురాను అసాధ్యమేమోననే భయంకూడా కలిగించె సమస్య అయింది. ఈసందర్భంలో ఆమెలోని నిగ్రహశక్తే పనిచేసిందిగాని, అనుగ్రహగరిమ ఉపయోగించింది కాదు. ఆమె రామనారాయణవ్యక్తితో అభిముఖంగా సంబంధమున్న పనులన్నీ రాజేశ్వరివంతుకు విడిచిపెట్టింది. కాని, అందుకు ఫలితంగా, అతడు విసుగుకోవడమూ, ఒక్కొక్కనాడు భోజనానికి సైతమూ ఇంటికిరాకపోవడమూ మాత్రమే జరిగేవి. ఒకమారు విసుగుకొనిన తరువాత అతనికంటపడడానికే రాజేశ్వరికి గుండె దడదడలాడేది. అల్లాటి సమయాల్లో అతనిని సమాధానపరచే భారం సంపూర్ణంగా లక్ష్మిదే!

సాధారణంగా స్త్రీలందరిలోనూ మాతృత్వచ్ఛాయ లుంటాయి; అందులోనూ కొందరిలో అవి మరీ స్ఫుటంగా కనిపిస్తాయి. అట్టివారిలో లక్ష్మి ఒకతె. ఆమె రామనారాయణకని చేసే ప్రతిపనిలోనూ భార్యాత్వపు పాళ్లకంటె మాతృత్వపుపాళ్లు చాలా ఎక్కువ. అందుకనే ఆమె వరాసగా రెండు మూడురోజులు కనబడకపోతే అతడు ఎంతో తల్లడిల్లిపోయేవాడు. తన ఆందోళనను ప్రకటించడానికి వేరే సాధనమేమీ లేక(తగినంత కారణం లేదని తనకూ తెలిసినా) ఎదుటనున్న రాజేశ్వరిమీద విరుచుకుపడేవాడు.

రాజేశ్వరి పూర్వంవలె రామనారాయణతో మాటకుమాట చెప్పి వివాదపడటం లేదు; కాని అతను ఆడిన ప్రతిమాటకూ సమాధానంగా పదిమాటలు మనస్సులో అనుకొంటూనేఉంది. అయినా బాహాటంగా అతనితో జగడమాడితే తనను లక్ష్మి తొందరపాటుమనిషి అనుకొంటుందేమోనని ఆమెభయం. లక్ష్మిపట్ల ఆమెకు మొదటఉన్న అభిప్రాయాలకూ, నేటిఅభిప్రాయాలకూ ఎంతో ఎడం ఉంది. కాని ఆమెలో రామనారాయణమీద మొదట్లో ఉన్న అభిప్రాయాలే ఉన్నాయి నేటికీ. ఇప్పటికీ అతనిలోని అనంతములయిన లోపాలను, పేదరికాన్ని అతనిచేత ఒప్పించి తన్మూలంగా అతనిని స్వాధీనుణ్ణి చేసుకోవాలనే ఆమెఆశయం. ఈ రకపు భావనలలోని గుణదో

పాలు ఎల్లా ఉన్నా వాటి సాహాయ్యమున పరిశీలించి నప్పుడు రామనారాయణస్వభావంవంటి గ్రంథములో పులులూ, కొండచిలువలూ, తిమింగిలాలూ మాత్రమే గోచరిస్తాయి ప్రతిపుటలోనూ.

*　　*　　*

రామనారాయణను మహామేధావి అనలేము గాని, అతని ధారణాశక్తినిమాత్రం మెచ్చుకోకతీరదు. ఒకమారు అతని మస్తిష్కంలో ప్రవేశించిన ఏ అంశమయినాసరే, అందులో స్థిరమైపోవలసిందే. ఈ శక్తి అతనికి విద్యార్థిగా ఉన్నప్పుడు ఎంతో ఉపకరించింది. ఒకప్పుడు మేష్టర్లకి కోపం తెప్పించేదికూడా ఈ శక్తే. కాని, ఆఫీసుపనిలోమాత్రం యీ శక్తి అతనికి విపరీతమయిన ప్రాముఖ్యాన్నిచ్చింది. పని చేయడం మొదలుపెట్టిన ఈ అయిదారు సంవత్సరాలలోనూ కంపెనీకి సంబంధించిన ఎన్నో విషయాలను పదిలపరచే డతడు తన మెదడులో. అందువల్ల ఆఫీసులో ఎవరికి ఏ రూలులో సందేహం వచ్చినా రామనారాయణదగ్గరకు రావలసిందే. అయితే, ఆ విషయాలేమీ రామనారాయణ సృష్టించినవి కావు; రిఫరెన్సు పుస్తకాలలోనివే. కాని ఆ పుస్తకాలకు బోధనాశక్తి లేదు. కేవలం నాటకంలోని పాత్రలవలె వన్నుమోరులుపాడడమే వాటికి రావడంచేత వాటినుండి విషయసంగ్రహణ చేయడం చాలా శ్రమసాధ్యమయిన పని. ఆ శ్రమను అక్కరలేకుండా చేస్తున్నాడుకదా అని రామనారాయణమీద గౌరవమూ, అభిమానమూ.

అతని కున్న గౌరవం ఆఫీసుపరిహద్దులలో నిలిచిపోలేదు. మిత్రమండలిలోకూడా అతనికి మంచి పేరుంది ఒక నిశితుడూ, నిర్మొగమాటస్థుడూ అయిన విమర్శకుడుగా. అతని విమర్శనలేవీ పుస్తకాకృతిని పొందలేదు. అథమం పత్రికలలోనయినా తరుచూ వచ్చేవికావు. కాని మిత్రమండలిలోమాత్రం అతని విమర్శనలంటే ఎంతోగురి. కొందరు మిత్రరచయితలతని సలహాల ననుసరించి తమ రచనలను సవరించుకోడం, మార్చుకోవడం చాలామందికి బాగా తెలిసిన అంశమే. అయితే అతనివలన సంస్కృతిన పేక్షిస్తూ అతనికంటె ప్రత్యక్షంగా చాలాతక్కువగా వున్న వారి పేర్లపాటికూడా అతని పేరు విశ్రుతంకాకపోవడము ఒకరిద్దరు ముఖ్యమిత్రులకు మనఃకంటకంగా ఉండేది. వారు "వాళ్లకూ వీళ్లకూ సలహాలిచ్చి అమూల్యములయిన నీఅభిప్రాయాలను గాలికి వదిలేకంటె నీవే వాటికి ఆకృతినిస్తే? ఎంత బాగుంటుంది! నీవంతు నువ్వు రాసిపడేద్దూ! తక్కిన ప్రచురణభార మంతా మాది" అనేవా రప్పుడప్పుడు. కాని రామనారాయణను ఆక్రమించుకొనిఉన్న జడప్రకృతి అంత మాత్రంలో పలచబారేటంతటి తేలికైనది కాదు.

"ఎందుకులేద్దూ; ఇంతమంది రాస్తున్నారు, ఇన్ని మహాగ్రంథాలున్నాయి. నిజంగా మనం ఏశాస్త్రంలోగాని, కళలోగాని ఒక చిన్నభాగాన్నైనా సంపూర్ణంగా అర్థం చేసుకొందుకు మన ఈజీవితాలు చాలవే! ఇక మనము మన యీ మిడిమిడిజ్ఞానాలతో విమర్శనలూ, సంస్కరణలూ ఏమిటి? కాక, నామట్టుకు నాకు స్వతంత్రంగా అభిప్రాయాలేమీ ఉన్నా యనుకోను. నాది అంతా ఫోటోగ్రాఫిక్ ప్లేటు వంటి తత్వము. ఎదుటపడిన ప్రతివస్తువునూ ఛాయాకాంతుల వ్యత్యాసాలతో పరిగ్రహించడమే నాపని." — సుమారు ఇదేపద్ధతిని ఉన్న అతని ధోరణిని విని స్నేహితు లిదమిత్థమని తేల్చుకోలేకపోయేవారు.

అసలు అతని వాగ్వైఖరిలోని ప్రత్యేకత ఏమిటంటే, అతడు మాటాడినా వాదించినా సామాన్యముగా ఒకే లాగుండేది. సాధారణంగా ఎవరయినా వాదిస్తున్నప్పుడు అతడు కలుగజేసుకోడు. సద్దుచల్లారిన వెనుక ఎదుటివారి సమాధానముల నపేక్షించని, ప్రశ్నపరంపరాపూర్ణమయిన ఉపన్యాసంవలె ఉండేది అతని ధోరణి. అతని మాటలతీరు ఎదుటివారిని విమోహితులను చేసి స్వవశులను చేసుకొనే పద్ధతిదికాక, వారిని అనేక రంగములలో తిప్పి,

తబ్బిబ్బుచేసి, మాటాడడానికి సందివ్వని తొందరతో కూడిన మహాప్రవాహం వంటిది. అందుచేతనే కొత్త వారికి అతని మాటలు కొంచెం కటువుగా తోచేవి. పాతవారికికూడా, తరువాత ఎంతసేపటికోగాని అతని మాటలలోని యథార్థపరత, పరసహిష్ణుత గోచరించేవి కావు. కాగా అతనిని అర్థంచేసుకొని మెచ్చుకుందుకుకూడా, వ్యక్తిగతపరిశీలన పూర్వకమయిన సాహచర్యం చాలా అవసరము.

ఇంతగా ఎందుకు చెప్పవలసి వస్తున్నదంటే అతనికి యీమధ్య మిత్రమండలితో—అందులోనూ సాహిత్యోపాసక సంఘంతో సంబంధము బలవత్తరమౌతూంది. విద్యార్థిదశలో ఉన్నంత కాలమూ సంగీతసాహిత్యసాధనలోనే జీవితశేషం గడుపవలెనని ఆతని ఏకైకనిశ్చయం. కాని కళాశాలను వదలినవెంటనే అతని జీవితంలో అదివరకు అంత ముఖ్యంగా తోచని ఇంకొక లక్ష్యం వెలువడింది. అది పరాధీనతా వైముఖ్యము; స్వయం పోషణ భారవహన ప్రియత్వమూనూ. దానితో అతడు తప్పనిసరిగా ఉద్యోగంలో ప్రవేశించవలసి వచ్చింది. ఉద్యోగ విషయంలో దొరికినపాటి స్వాతంత్ర్యమే వివాహ విషయంలోనూ (తన చిన్నతనంలోనే తండ్రి నిశ్చయించి గతించడం మూలాన) లభించింది. ఉద్దేశాలు ఎల్లా ఉంటేనేం? అతడొక సామాన్యగృహస్థయేడు. మరీ సామాన్యుడయిన ఆఫీసుస్టెనోటైపిస్టయేడు. అవడమేమిటి, అభిప్రాయాలతో సంబంధం లేని కాలసాగరాన్ని దైనిక పద్ధతి (Routine) అనే పడవతో ఈదుతున్నాడు.

విద్యార్థిదశలోని ఆశలూ, ఆశయాలూ అన్నీ కట్టిపెట్టి, ఇన్నాళ్లవరకూ తన గృహసీమను ప్రగాంతంగా చేసుకొందామన్న పట్టుదలతోనూ, ఆఫీసు వ్యవహారాలను కరతలామలకాలు చేసుకొందామన్న దీక్షతోనూ తన కాలాన్నీ, శక్తినీ సంపూర్ణంగా వినియోగించేడు. అతని ప్రయత్నాలలో ఒకదానిలో ఆఫీసువ్యవహారాలలో (ఆర్థికలబ్ధి లేకపోయినా) సంపూర్ణవిజయం; రెండవదాంట్లో గృహసీమను ప్రశాంతంగా చేసుకోవడంలో (సామాన్యసౌఖ్యానికి లోటులేకపోయినా) పరిపూర్ణపరాజయం. ఇవేమీ పెద్దసమస్యలు కావనీ, తాను న్యాయతః ఇంతకంటె ఉదాత్తములయిన విషయాలనే యోజించి, మూగప్రేక్షకుని స్థితినుండి నటకుని స్థితికి రావలసినదనీ అతనికి ఏదో అంతర్వాణి ప్రబోధించేది. కాని, చిన్నతనంనుండీ తల్లిదండ్రులూ, తోబుట్టువులూ లేని దైన్యమూ, సమీపస్థుల సంతతేర్ష్యానిరసనలకు ఫలితమయిన ఉత్సాహహైన్యమూ అతనిలో కొంతవరకూ జడతగా పరిణమించేయి. అందువల్లనే అతడు ప్రపంచాన్ని ఎప్పుడూ అనుమానంతోనూ, భయంతోనూ, ముందుకాపుతోనూ మాత్రమే చూడగలడు. ఈ రకపు వింతచూపే కొన్నిచోట్ల నిదానంగానూ, కొన్నిచోట్ల నిర్లక్ష్యంగానూ లోకులనోట అనేక నామాంతరాలు ధరించింది.

ప్రస్తుతపు రామనారాయణదైనందినచర్యకూ, వెనుక లక్ష్మీవచ్చిన కొత్తలోని అతని చర్యకూ కేవలం ఉత్తరదక్షిణ ధ్రువాల కున్నంత ఎడముంది. అప్పుడతడు రోజుకు ఏ ఒకటి రెండు గంటలో బైటికివచ్చేవాడు. అదీ తప్పనిసరైన బజారుపనో, అటువంటిదో ఉన్నప్పుడు మాత్రమే. అల్లాటి సమయాల్లో ఎవరైనా స్నేహితులు బలవంతంగా ఫలహారానికో, బాతాఖానీకో నిలిపితే అతనికి ముళ్లమీద ఉన్నట్టుండేది. అప్పుడు ఇల్లు కదిలిరావడమంటే ఎంత బెంగగా, కష్టంగా ఉండేదో, ఇప్పుడు ఇంటికి వెళ్లడమంటే అంత వెగటుగా, భయంగా ఉంది.

ఇటీవల ఉదయం కార్యాలయంలో రామనారాయణదే మొట్టమొదటి అటెండెన్సు. ఒక కప్పు కాఫీమాత్రమే పుచ్చుకొని తొలినాటి సాయంవేళను వచ్చిన పేపరు సమగ్రంగా చూసేలోపున ఒకరొకరే మిత్రులు దిగబడతారు. మామూలురోజుల్లో ఇదే మిత్రమండలి సమావేశస్థలమని చెప్పవచ్చును.

తొమ్మిదింబావువరకూ కార్యాలయంలోనే ఉండి, పదిన్నరలోపునే ఆఫీసులో కిల్లీ నములుతూ ప్రత్యక్షంకాగలడంటే, అతడు ఇంటివద్ద ఎంత తీరికేగా భోజనాదికం నిర్వర్తించుకొనేదీ సులభంగా గ్రహించవచ్చు. ఒంటిగంటనుండి రెండుగంటలవరకూ ఆఫీసుకు ఒకమాదిరిసెలవు. మునుపు ఈగంటలోనూ కాఫీకని ఇంటికి వచ్చేవాడు. ఇప్పుడు సాయంకాలం ఆఫీసుఅయినతరువాతనే ఇంటికి వెళ్లవలసిన ఆవశ్యకత గోచరించలేదు. అనుదినమూ ఆఫీసుపనిలో ఎవరికో ఒకరికి సహాయంచేయవలసిఉండడంవల్ల ఆరుగంటలకుపైగా అయేది బైటపడేసరికి. తిన్నగా రెస్టారెంటూ, లై।బరీ, పార్కూ ఇవీ అతని గమనీయదేశాలు. రాత్రి చాలాపొద్దుపోయేవరకూ అక్కడే వుండిపోయేవాడు. రాత్రి భోజనమయినతరువాత నిద్రవచ్చేవరకూ ఏదో పుస్తకం చదువుతూఉండేవాడు. కాని వారం పదిరోజుల క్రితంనుండి అతడికి ఇంకొక ఆనందజనకమయిన వ్యాపృతి ఏర్పాటయింది. మిత్రమండలివారు ఈ వచ్చే వార్షికోత్సవానికి రెండునాటకాలు వేయడానికి సంకల్పించుకొన్నారు. రిహార్సలుచేయించి తరిఫీదుచేసేపూచీ చాలావరకూ రామనారాయణమీదనే పడ్డది. కాగా రాత్రి పన్నెండుదాటేవరకూ పరిషత్తు కార్యాలయంలోనే కాలక్షేపం. బాగా రాత్రి మీరితే, ఒక్కొకనాడు నిద్రకూడా అక్కడే.

* * *

లక్ష్మి రామనారాయణకు నానాటికీ దూరమౌతున్నకొద్దీ అతనికి ఆమెమీది ప్రేమ విపరీతం కాసాగింది. ఆమె అతనికి బాహ్యదృష్టిలో ఎంత అందుబాటులో లేకపోతున్నదో, ఆంతరదృష్టిలో అంత సన్నిహితురాలుగా ఉంటున్నది. ఇప్పుడామె ఎదురుగా వచ్చి తూలనాడినాసరే చలించనంత దట్టంగా వ్యాపించినై అతని మనోంబరం మీద అనురాగాంబుదాలు. అయితే ఇంత అనురాగమూ, ఇంత ఆకాంక్షా ఉండీకూడా అతడామెను తనకు ఎడంగా ఉండనీయడం మొదట్లో లక్ష్మికే ఆశ్చర్యహేతువయింది. ఈవిషయంలో రామనారాయణ దృఢవిశ్వాసం ఏమిటంటే, బలవంతంగా స్వంతం చేసుకొన్న సౌందర్యంలో జీవనచైతన్య మంతరించి వేరే అనుభవించవలసిన దేమీ ఉండదని.

లక్ష్మిప్రయత్నాలకు ఫలితంగా రామనారాయణకు తనమీద ప్రేమ తగ్గనూలేదు; రాజేశ్వరియెడల ఎటువంటి నూతనోద్దేశమూ కలగలేదు. కాని విపరీతంగా, రామనారాయణ యింటికి మరీమరీ దూరంగా ఏదో పరాయివాడులా అయిపోవడమూ, తత్ఫలితంగా లక్ష్మిరాజేశ్వరులమధ్య నున్న వైమనస్యాలంతరించి అనురాగం వృద్ధిపొందటమూ సంభవించింది. వారు పరస్పరమనోవేదనలను వివరించుకోడానికికూడా ఎటువంటి సిగ్గూ, సంకోచమూ పొందటం లేదు. అంతేకాదు; ఒకరికోసం ఒకరు ఎంతేనా త్యాగంచెయ్యడానికికూడా ఇప్పుడు వారు సంసిద్ధులే. ఇప్పుడు రాజేశ్వరి గర్భవతిఅయిన లక్ష్మిని ఇంట్లోని ఏపనినీ ముట్టనీయలేదంటే, అది ఒక విధి అనిగాని, ఒకరి మెప్పు పొందాలనిగాని కాదు; తాను ద్వేషించినాసరే తన్ను ప్రేమించగలిగిన లక్ష్మిని సుఖపెట్టడంలోనే అననుభూతమైన తృప్తినీ, ఆనందాన్నీ పొందగలగడమే ఆమెలోని ఈఔదార్యాంచితత్వానికి కారణం.

ఇటీవలి రాజేశ్వరిలోని పరిణామాన్ని గుర్తించి ఉండేమాటైతే రామనారాయణ ఎప్పటి గృహస్థయే వాడేనేమోగాని, అతని హృదయంలో ఇప్పుడు రాజేశ్వరినిగూర్చిన యోచనకే స్థానంలేదు. ఏదో ఆదర్శభావనాప్రణయినిగామాత్రమే లక్ష్మి కనిపిస్తున్నదిగాని, వాస్తవికప్రేయసిగా ఆమెచిత్రంకూడా మునుపటిఅంత ఉజ్జ్వలంగా లేదు. అయినా ఆమె అతనిని సమీపించి పూర్వపుచనవుతో చల్లగా, హాయిగా పలకరించటమే చాలు అతనిని ఎంతో కలవరపరుస్తూ ఉన్న ఈ సాంఘిక, నైతిక సమస్యలనన్నిటిని అతని మెదళ్లోంచి తరిమి, అకృతకమూ, అవధిరహితమూ అయిన ఆనందార్ణవంలో మునకలు వేయించడానికి. అయితే ఆమెకు ఇప్పుడెంతసిగ్గు! అందులోనూ రాజేశ్వరికి తనమీద అభిమానం ఎక్కువయిన దగ్గర

నుండీ ఆమె శోభనపుపెళ్లికూతురయింది. ఆమెకు బావకంటపడడానికే సిగ్గు. తప్పనిసరిగా తారసపడితేనే ఆమెకు ఎంతో మొగమాటంగా ఉండి ఒళ్లు ముచ్చెమటలూ పోసేది. అతనికీ ఆమెను పరీక్షగా చూడడానికి ఏదో చెప్పలేని జంకూ, గాభరా.

రామనారాయణఆఫీసుపనిలోని చాకచక్యమూ, అతని బి. ఏ. డిగ్రీ ఇన్నాళ్లూ నిష్ప్రయోజనాలుగానిద్రించినా పరిస్థితులు సానుకూలంగాఉన్నప్పుడు వాటిపని అవి చెయ్యకపోలేదు. ముఖ్యంగా తన మీది ఆఫీసరు అనుగ్రహంవల్ల అతడు స్వప్రయత్నంఅక్కరలేకుండానే, వేరొక బ్రాంచి ఆఫీసుకు అసిస్టెంటు మేనేజరు కాగలిగేడు. అవడమేమిటి,అయిన వెంటనే పని ఆరంభించి తీరాలి, చాలా నిలవఉందన్నారుపై అధికార్లు. రామనారాయణ కివేమీ అంత ఆలోచించవలసిన విషయాలుగా తోచలేదు. అతని మనస్సంతా ఇప్పుడు రాబోయే సాహిత్యపరిషత్తులో తాను యివ్వవలసిన ఉపన్యాసంతోనూ, వేయించవలసిన నాటకాలతోనూ నిండిపోయింది. అయితే, అతనిలోని, నిరాలోచనంగా, దైనందినాభ్యాస పూర్వకంగా సంచలించే భాగమే అతనిచేత ఆఫీసునుంచే ఇల్లా వ్రాయించింది:

“నేను రాజమండ్రీలోని మా కంపెనీబ్రాంచికి అసిస్టెంటుమేనేజరు అయినట్టు ఇప్పుడే ఆర్డరు తీసుకొన్నాను. ముందుగా మద్రాసు ఒకమారు వెళ్లి ఆ తరువాత రాజమండ్రీలో ఛార్జి తీసుకోవాలి. నేను ఇవాళ మెయిలుకే మద్రాసు బయలుదేరకతప్పదు. మళ్లీ ఎన్నాళ్లలో రాగలనో నిశ్చయంగా తెలియదు. కాబట్టి, ఇంట్లో ఉన్న నా బట్టలన్నీ పెద్దపెట్టెలో సర్ది, నాకేంపుకాటు, హోల్డాలుతో కలిపి సరాసరి స్టేషనుకు పంపించు. నేను మద్రాసు వెళ్లి మళ్లీ రాస్తాను. ఈ లోగా ఏమయినా అవసరంఉంటే శంకరానికి కబురుచేస్తే, వచ్చి కావలసిన సహాయం చేస్తాడు.

రామనారాయణ.”

ఎడ్రసు లేని ఈ ఉత్తరం లక్ష్మీరాజేశ్వరుల ప్రత్యేక మనస్సులమీద ఎల్లా పనిచేసినా,మొత్తంమీద, అందువల్ల, వారిని పరస్పరమూ కట్టిఉంచే అనుబంధ సూత్రముమాత్రం కించిత్తయినా సడలలేదు. ఇక, జరిగిన విషయమేమిటంటే, లక్ష్మి ఎంతో అయిష్టంగా సహాయంచేయగా, ఆనందాతిరేకంలో ఏమిచేస్తున్నదో తనకే తెలియకుండా, రాజేశ్వరి రామనారాయణకు కావలసిన సామానంతా సర్ది స్టేషనుకు పంపించింది.

ఇదివరకూ రాజేశ్వరిని ఎంతో కలవరపరచిన అసంతృప్తీ, క్రోధమూ అన్నీ అంతరించేయి ఆమెలో. ఆమెహృదయము ఇప్పుడానందాంచితమే కాదు, ఔదార్యోజ్వలంకూడా అయింది. ఇప్పుడు ఆమె దేనినయినా క్షమించగలదు.

ఇన్నాళ్లూ మూగగా కాలక్షేపంచేస్తున్న తాను స్వయంగా వెళ్లి ఇరుగుపొరుగువారితో తన భర్త ఉద్యోగాభివృద్ధినిగూర్చి తన్మయత్వంలో చర్చించటం మూలాన ఆమె ఇటీవల లక్ష్మిలో వచ్చిన మార్పును గమనించలేకపోయింది. కాని ఆ రకపు సంభాషణ కేవలం తనకు ఉత్సాహం కలిగించే విషయాలతో ఆగిపోకుండా, తనకూ తన భర్తకూ వచ్చిన వివాదాలవైపూ, లక్ష్మిలో వారు చూసిన గుణదోషాలవంకా (తనకు ఎంత అయిష్టంగా ఉన్నా) ప్రసరించడమూ, హితబోధ అనే మిషతో వ్యంగ్యంగా తన్ను ఈసడించడమూ రాజేశ్వరిని మళ్లీ ఇంట్లో విడిఖయిదీని చేసేయి. సర్వదా ప్రశాంతమయిన లక్ష్మిమొగంమీద ఈ నాలుగు రోజులలోనూ ఎంత దిగులు అత్తుకొనిఉన్నదీ అప్పుడు తెలిసింది ఆమెకు.

మునుపల్లా రామనారాయణను సరిదిద్దాలనో, అతని అనుగ్రహాన్ని సంపాదించాలనో వినియోగపరచిన తన శక్తిని సర్వమూ ఇప్పుడు లక్ష్మిని ఆనందపరచటంకోసమే రాజేశ్వరి ఉపయుక్తంచేస్తున్నది. కొందరి జీవితములే అంత. బైటికి బహు సామాన్యంగానే ఉన్నట్టుండి, ప్రతిక్షణమూ ఏదో ఒక సమస్యతో ఎంతో అంతస్సంగ్రామము చేస్తూ ఉంటారు. వాళ్లకు మరి శాంతన్నది ఉండదు. అల్లాటివారిలో

రాజేశ్వరి ఒకతె. రామనారాయణకూడా చాలా వరకూ ఈ తరగతిలోనివాడేకాని, సంగీతమూ సాహిత్యమూ మొదలయిన కళలలో లీనమయి కొంతవరకయినా అతడు తనను తాను విస్మరించగలడు; రాజేశ్వరి నిద్రలోకూడా తననూ, తన వాతావరణాన్నీ మరిచిపోలేదు—అంతే భేదము.

ఆమెవెనుకటిప్రయత్నాలన్నిటికీ ఒక గర్వించవలసిన సామాన్యలక్షణం ఉండేది. ఆమెకు ఎందులోనూ సంపూర్ణపరాజయం లేదు. కొద్దో గొప్పో విజయం లభించేది. కాని ఇప్పుడు ఆమహోత్సవం కూడా అయింది. ఆమె తన శక్తినంతటినీ వినియోగించికూడా లక్ష్మిలోని దిగులును తగ్గించలేకపోయింది. మామూలుగా ఆమెను నవ్వించే మాటలను ఎన్నోమార్లు పిచ్చిగా అంది; ఆఖరుకు కితకితలుకూడా పెట్టింది. కాని ఏంలాభం? లక్ష్మి మొగం మరీ దించుకుపోయింది; ఇక తానేమన్నా ఆమెహృదయం బాష్పవర్షంగా పరిణమిస్తుందేమోనన్న భయంతో రాజేశ్వరి ఎడంగా వెళ్లిపోయింది; అదీ వైఖరి.

సుఖమూ, దుఃఖమూకూడా ఒకమాదిరి అంటువ్యాధులవంటివే. అవి శూన్యప్రదేశాలలో కూడా వ్యాపించగలవేమో? కాకపోతే ఆనందమో, ఆవేదనో, లేక వాటి ఛాయలో అవి శూన్యహృదయాలమీదసైతమూ (క్షణికంగానయినాసరే) ప్రతిబింబించడం ఎలా సాధ్యమౌతుంది? అయితే సుఖమన్నది ధనమంత చంచలమూ, దుఃఖమన్నది దారిద్ర్యమంత స్థిరమూ కావడంవల్ల మనుష్యులమీద రెండవదాని ముద్ర మొదటిదానిగురుతుకంటె చాలా బలవత్తరంగా పడుతుంది. ఆ ముద్రను తొలగించడానికి వచ్చిన చేతులు అందులో కొంత నలుపును తమకు అంటించుకోగలవు—అంతే; కాని ముద్రమాత్రం స్థిరంగా వ్యక్తిని అంటిపట్టుకొనేఉంటుంది ఆజన్మాంతమూ.

లక్ష్మిని ఊరడించి ఆమెకు తన ఉత్సాహంలో వంతు పంచిఇవ్వాలన్న అభిప్రాయం రాజేశ్వరిలో కొద్దిరోజుల్లోనే అంతరించింది. క్రమంగా ఆమె హృద్వీణ లక్ష్మిలోని మూకవేదనాగానానికి మారుమ్రోగసాగింది సహానుభూతిమంతమై. ఏది ఏదో తెలియని ఆవేదనాప్రపంచంనుండి వారిని వాస్తవికజగత్తులోనికి తెచ్చినది రాజేశ్వరిచెల్లెలు సరళ. అందుకోసం ఆమె ఏమీ యత్నించలేదు. కాని ఆమెచెప్పిన మాటలలోని నిశితమయిన సత్యమంతటిది. ఆమెరామనారాయణ వెళ్లిపోయిన పదిహేనురోజులకు అకస్మాత్తుగా అన్నమాధవరావుతో కలిసి వచ్చింది.

ఇక సరళకథ: ఆమె తన ఇటీవలి చరిత్ర యావత్తూ కొద్దివాక్యాలతో రాజేశ్వరికి తెలియజేసింది. దానిని ఆమె అట్టే పెంచకుండా యథాతథంగా లక్ష్మికి విశదీకరించింది. అవి కేవలం హృదయాలకు సంబంధించిన వాక్కులు. కాబట్టే ఎంత సంగ్రహరూపంలో ఉన్నా, అవి అపార్థంచేసుకోబడవు.

మొదటినుండీ బలహీనుడూ, జాడ్యగ్రస్తుడూ అయిన సరళభర్త గోవిందరావు ఉన్న కొద్దిశక్తినీ స్కూలుపుస్తకాలకే బలిపెట్టి, ఉద్యోగంలో ప్రవేశించేవేళకే చాలా బలహీనుడయేడు. అంతవరకూ అతని పెళ్లికట్నం పెరగడమే అయిందిగాని, అతనికి వివాహంమాత్రం కాలేదు. దేహారోగ్యాన్ని బట్టి చూస్తే, ఇక వివాహమే మంచిది కాదేమో అనే స్థితిలో సరళతండ్రి మధుసూదనరావుగారు అతని మేనమామా, పెంపకపుతండ్రీ అయిన జానకిరామయ్యగారి షరతులన్నిటికీ ఒప్పుకొని అతనిని ఒక గృహస్థును చేసేడు. అసలు మధుసూదనరావుగారి తాపత్రయమేమిటంటే, చిన్ననాటి స్నేహితుని కొడుకుకదా అనీ, పెద్దమ్మాయి రాజేశ్వరిని సామాన్యస్థితిమంతుడైన రామనారాయణ కిచ్చేశాను—ఇక సరళనయినా బాగా చదువుకున్నవాడూ మంచి ధనవంతుడూ అయినవాడికిద్దామని. గోవిందరావు మధుసూదనరావుగారి కోర్కెలకు తగిన అల్లుడే. ఇక అతనితోటి సాంసారికజీవితంలో సరళ పొందే ఆనందము సంగతా? అది "మన స్థితిగతులకు, పరువుప్రతిష్ఠ

లకూ తగినవాడి కిచ్చి వైభవోపేతంగా వివాహము చేసేము" అన్న మధుసూదనరావుగారి సంతృప్తిముందు ఏమాత్రం లెక్కించవలసినవిషయముగనక ? ఏమయితేనేం, వైవాహికబంధంతో సరళ గోవిందరావు సహచరిణి అయింది.

గోవిందరావుక్షయవ్యాధి క్రమంగా దాచటానికివీల్లేని స్థితికి వచ్చింది. "పెళ్లికి ముందుగానే యీవ్యాధి వచ్చిఉంటే, నా కెల్లానూ తప్పదు, నీవయినా సుఖపడిఉందువేమో ?" అని భర్త తనతో ఎన్నోమార్లన్న మాటలను మనసా విశ్వసించడానికే యత్నించేది సరళ. కాని, పెళ్లికి అధమం ఆరునెలలయినా ముందుగా అతను నిస్సంశయంగా వ్యాధిగ్రస్తుడయినట్లు తనకున్న అనుమానం అణచుతున్నకొద్దీ బలవంతము కాసాగింది సరళహృదంతరంలో.

ఇక మరి మామూలుమందులు లాభంలేదని, అతడు మదనపల్లి శానిటోరియమ్‌కు ప్రయాణం కట్టేసి వెక్కివెక్కి ఏడుస్తూ సరళతో — "నిన్ను చూస్తూఉంటే నాదుఃఖము మరీ మితిమీరుతుంది ; నువ్వు దూరంగా వుంటేఏదోఒకవిధంగా నీవు సుఖిస్తున్నావని నన్ను నేను నమ్మించుకుందుకు ప్రయత్నించగలను.

"పాపం, ఈరెండేళ్లలోనూ, నాలోఅవ్యక్తంగా అణగివున్న ఆత్మకు ఒక ఆకృతి నిచ్చేవు ; సహజమయిన గాలినీ, వెలుతురునూ నాకు ప్రసాదించటానికి నీశక్తికి మించికూడా శ్రమించేవు ; కాని నీశ్రమకూ, నీఔదార్యానికీ సార్థక్యం కల్పించేపాటి భాగ్యము నా కలభ్యమయింది. నన్ను నీవు ప్రేమిస్తావు—అదే నాదుఃఖకారణం. నీవేగాని నన్ను ద్వేషిస్తూఉండేమాటైతే నాకీవ్యాధి వచ్చినందుకెంతో సంతోషించి ఉందును. అధమం నన్ను నీవు మరిచిపోతానంటే చాలు ; అదే నాకు కొంత తృప్తి నిస్తుంది."

సరళ ఏమేమో అనాలనుకొంది. కాని ఒక్క మాటకూడా వెలికిరాలేదు. చివరకు ఆమెకళ్లంట నీళ్లుకూడా రాలేదు. అంతగా ఎండిపోయింది ఆమె సుకుమార హృదయం. అదివరకు అంత నైరాశ్యంలోనూ ఆమెఎన్నో అతిలోకములయిన ఆశాలతలను వీక్షించగలిగేది. గోవిందరావునోటివెంట అల్లాటిమాటలను విన్న తరువాత ఆమెకు ఆశించవలసిందిగాని, ఆలోచించవలసిందిగాని ఏదీ కనిపించలేదు.

ఇంతటి అమాసచీకటిలోనూ ఒక చిన్ననక్షత్రం ! సరళకూడా ఇప్పుడు గర్భవతి.

అనంతమయిన కాలసాగరంలో (పదిహేను రోజులు)ఒక పక్షమన్నది ఒక జలకణంపాటికూడా కాదు. కాని మన యీజీవితాలపరిమాణంలో చూసినప్పుడుమాత్రం ఒక పక్షమే అక్కరలేదు (పరిస్థితులనుబట్టి)ఒక దినమేమిటి ఒక్కక్షణంకూడా జీవితమంతటికీ చూడామణివంటిది వుంటుంది మహాసముద్రంలో అపురూపంగా దొరికే రత్నాలవలే. అదివర కెన్నిపరిణామాలు వచ్చినా, వారిముగ్గురి జీవితాల్లోనూ విభిన్నవ్యక్తుల అన్యోన్యంవలన సాధ్యమయిన ఆనందమునంతటినీ ప్రసాదించినదీ, స్వార్థమూ సంకుచితత్వమూ మొదలయినవాటికి అతీతమయిన తన్మయతను దయచేసినదీ ఆ ఒక్కపక్షమే. సామాన్యంగా చాలా అనుభవాలకు ఏవేవో క్రియల దోహదం కావాలి ; కాని వెన్నెలలోని ఆనందంవలె ఈఅనుభూతి స్వయం పోషకం.

లెక్కలనుబట్టి చూస్తే లక్ష్మికి ముందుగా పురుడు రావాలి. కాని, అనుకున్నకంటె సుమారు ఒక నెల ముందుగా సరళకు పురుడువచ్చింది. పుట్టిన ఆడపిల్ల వారంరోజులుమాత్రమే బ్రతికింది. ఆతరువాత పదిరోజులకు లక్ష్మికి పురుడు వచ్చింది. చక్కటి పనసపండువంటి మగపిల్లవాడు పుట్టేడు. ఆపిల్లవాణ్ణి చూసి సరళ తన దుఃఖాన్నంతటినీ మరచిపోగలగడంలో విశేషమేమీ లేదు. అంత జనముద్దుగా ఉన్నాడు కుఱ్ఱవాడు. అయితే తల్లిమాత్రం కొడుకును ఒక్కవారంకంటె ఎక్కువ చూసుకుందుకు నోచుకోలేదు. కాని, రామనారాయణను చూసేవరకూ ఆమెప్రాణం పోలేదు. తృప్తిగా బావ

చేతిలో చేయి ఉంచి, సరళచేతులలోని కన్నకొడుకును చూసుకుంటూ శాంతంగా, సంతోషంగా ఆమె గతించింది. మొదటినుండీ ఆమెపట్ల అన్నీ అన్యాయాలే చేస్తూవచ్చిన విధికి చివరివేళను ఈఆమె మెచ్చికో లెందుకో?

సరళకు పసిపాపలేని కొఱత తీరింది. కుఱ్ఱవాడి పాలకోసం మరి వెదుకుకోనక్కఱలేకపోయింది.

వెనుక లక్ష్మిలో కొంత భార్యాత్వమును, కొంత మాతృత్వమును చూడగలిగేవాడు రామనారాయణ. నేడు ఆమెలోని కేవలమాతృత్వభాగాన్నే వీక్షించగలుగుతున్నాడతడు సరళలో. ఆమెను ప్రేమించడానికి ఆమెదగ్గరనే ఉండనక్కఱలేదు. ఉన్నతమయిన ప్రేమకు సామాన్యమయిన ఈ లక్షణాన్ని స్వానుభవపూర్వకంగా రామనారాయణ ఇప్పుడిప్పుడే గ్రహించగలుగుతున్నాడు.

ఇక రాజేశ్వరీ రామనారాయణలు ఇప్పుడెల్లాటి భేదాభిప్రాయాలూ లేకుండా మనగలుగుతున్నారు. ఆమె ఒకమారంది: "బావా! నీలక్ష్మి బ్రతికేఉంది. ఆమెశరీరంతోపాటు రాజేశ్వరిఆత్మ నశించింది. అందువల్లనే నేనిప్పుడు నిన్నింత హృదయపూర్వకంగా 'బావా'అని పిలవగలుగుతున్నాను." రామనారాయణకు తాను విన్న పరమసత్యములలో ఇది ఒకటి అని దృఢవిశ్వాసము!

ఒక్కొక్కనాడు ఒంటరిగా కూర్చొని రామనారాయణ అనుకొంటూఉంటాడు: "మెరుపు ఎప్పుడో, ఎల్లాగో వస్తుంది; అది ఉన్న కొంచెంసేపూ తక్కిన ప్రపంచమే కనిపించదు; కాని అది అంతరించటంతో అదివరకుకంటేకూడా చీకటిగా ఉంటుంది లోకం! అయినా మనకు అసహ్యమయినంతమాత్రాన చీకటి రాకపోదుకదా లోకంలో."

వేరొకప్పుడు—"ఇంద్రధనుస్సు అపురూపంగా వస్తుంది అంబరంమీదకు. అందులోని మహిమ స్వశాశ్వతత్వంలోకాక వర్షారూపమయిన ఆకాశోర్వ్యల ఐక్యమును అనుసంధించటంలోనే ఉంది"అని ఊహిస్తాడు రామనారాయణ.

మొత్తంమీద రామనారాయణజీవితంలో ఇప్పుడొకవిధమయిన తూకమూ, తాలిమీ నెలకొన్నాయి. అతని కిప్పుడేవిషయంలోనూ విశేషం పట్టుదలలేదు. "లక్ష్మి శాంతిమయి; ఆమె జీవించియున్నప్పుడు ఆమెవ్యక్తిసౌందర్యంలో అంతర్లీనమయిఉన్న శాంతిప్రసాదము ఇప్పుడు హృద్వికాసజ్యోతీరూపమున కాంతిల్లుతున్న"దని అతని నిశ్చలభావన.

చెప్పడం మరిచేను—అతని కొడుకు పేరు "లక్ష్మీప్రసాద్."